## క్లుప్తంగా

### లక్ష్మీనరసింహస్వామి జయంతి

**జామి:** కుమరాం గ్రామంలోని కల్యాణ్‌నగర్‌లో ఉన్న లక్ష్మీనరసింహాలయంలో స్వామి వారి జయంతి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

### వేంకటేశ్వరస్వామి కల్యాణం

**జామి:** మండలంలోని అన్నంరాజుపేట వేణుగోపాలస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణిహరం సీతారామచార్యులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### గణపతి ఆలయ వార్షికోత్సవం

**వేపాడ:** మండలంలోని ఎం.శింగవరంలో వినాయకుని ఆలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు మంగళవారం ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకములు, అష్టోత్తర శతనామాలతో పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు.

### ఘనంగా నల్లమార్మ పండగ

**దత్తిరాజేరు:** పెదకాద గ్రామంలో నల్లమారమ్మ పంగడను మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమతో పూజించి మొక్కులు చెల్లించారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### అమ్మవారికి కుంకుమ పూజలు

**బొండపల్లి:** దేవుపల్లి గ్రామంలో రాజరాజేశ్వరి అమ్మవారిని మంగళవారం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు దూసి శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో భక్తులు పసుపు, కుంకుమ, పంచామృతాలతో అమ్మవారికి అభిషేకించారు.

### రేపటి నుంచి క్రీడాశిక్షణా శిబిరం

**చీపురుపల్లి:** పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు వేసవి క్రీడాశిక్షణా శిబిరం నిర్వహించనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు పీసీ స్వరూప్, కె.మురళీధర్ మంగళవారం తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు వాలీబాల్, టెన్నీకాయిట్, కబడ్డీ తదితర క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# వైభవంగా శ్యామలాంబ సిరిమానోత్సవం



అమ్మవారి సిరిమాను వద్ద పూజలు చేస్తున్న బొత్స ఝాన్సీలక్ష్మి



పురవీధుల్లో తిరుగుతున్న అమ్మవారి సిరిమాను

**గుర్ల:** మండలంలోని కోటగండ్రేడులో శ్యామలాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి సిరిమానును పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, పలువురు పార్టీ నాయకులు అమ్మవారి సిరిమానును దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఇన్‌చార్జ్ తహసీల్దార్ సూర్యనారాయణ, ఎస్సై హరి బాబునాయుడు చర్యలు తీసుకున్నారు.

**పాలస్నాన మహోత్సవాలు**

**చీపురుపల్లి రూరల్(గరివిడి):** గరివిడి మండలం అర్తమూరు గ్రామంలో శ్యామలాంబ అమ్మవారి పాలస్నాన మహోత్సవ కార్యక్రమాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, నిర్వాహకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలతో గ్రామస్తులంతా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి పాలస్నానం చేశారు.

**వైభవంగా పైడితల్లి పండగ**

**వేపాడ:** జగ్గయ్యపేట గ్రామంలో గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండుగను వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి తొలేళ్ల ఉత్సవం, ఘటాల ఊరేగింపు చేపట్టారు. మంగళవారం అమ్మవారి బండిప్రభను నిలబెట్టి తల్లికి మొక్కులు చెల్లించారు. సాయంత్రం డప్పువాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య అమ్మవారి ఘటాలను ఊరేగించారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు, డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, ఎంపీపీ సత్యవంతుడు, తదితరులుఅమ్మవారిని దర్శించుకున్నారు.

## సమన్వయంతో పనిచేయాలి

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



మండల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు

**కొత్తవలస:** అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ భవనంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ అధ్యక్షతన, ఎంపీడీఓ వై.పద్మజ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన మండల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని వివిధశాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా 'నాడు-నేడు' కింద చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి ఎం-బుక్ రికార్డు నిర్వహణలో ఏఈ రాముడు అలసత్వం వహిస్తున్నారని పలువురు సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చూడాలని హౌసింగ్ డీఈ శ్రీనివాసరావును సభ్యులు కోరారు. పెదరావుపల్లిలో రెవెన్యూ సంబంధిత సమస్యను పరిష్కరించాలని ఎంపీటీసీ పరిదేశినాయుడు, గ్రామీణ రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించాలని పలు గ్రామాలకు చెందిన సభ్యులు అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, జెడ్పీటీసీ నెక్కలి శ్రీదేవి, వైస్ ఎంపీపీలు మేలాస్త్రీ సరస్వతి, కర్రి శ్రీను, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, సర్పంచ్ ఎర్రా రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచితంగా ధ్రువపత్రాలు

**దత్తిరాజేరు:** పదో తరగతి, ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులకు ఉచితంగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందించనున్నట్లు తహసీల్దార్ రమేష్ మంగళవారం తెలిపారు. సిటిజన్ ఔట్‌రీచ్ సర్వేలో సేకరించిన వివరాల ప్రాప్తికి వీఆర్వోల ద్వారా నేరుగా విద్యార్థుల ఇంటికే ధ్రువపత్రాలు పంపించనున్నట్లు చెప్పారు.

## 13న జాతీయ లోక్‌అదాలత్

**చీపురుపల్లి:** హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 13న స్థానిక కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయరామేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్, సివిల్, ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని కేసుల నుంచి బయటపడాలని కోరారు.

## పుస్తకాలు అందజేత

**గంట్యాడ:** ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని గ్రంథాలయ అధికారి రామభద్రరాజు అన్నారు. స్థానిక గ్రంథాలయానికి తాడిపూడికి చెందిన రావాడ రామచంద్రరావు మంగళవారం పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందజేశారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలను విద్యార్థులు, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

**వేపాడ:** మండలంలో నీలకంఠరాజపురం గ్రామంలో ఎస్సీ కాలనీలో ట్రాక్టర్ ఢీ కొనడంతో విరిగిపోయిన విద్యుత్ స్తంభం స్థానంలో మంగళవారం కొత్త స్తంభం ఏర్పాటు చేశారు. సాక్షి పత్రికలో వచ్చిన కథనంపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వెంటనే కొత్త స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఏఈ సూరిబాబు పనులను పర్యవేక్షించారు.

# నవధాన్యాల సాగుతో నేల సారవంతం



రైతులకు నవధాన్యాల ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డీపీఎం ఆనందరావు

**వేపాడ:** రైతులు ఖరీఫ్‌లో పంటసాగుకు ముందుగా నవధాన్యాలను సాగు చేయాలని తద్వారా భూసారం మెరుగుపడుతుందని సుస్థిర వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు అన్నారు. బొద్దాం గ్రామంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఎకరానికి 10 నుంచి 13 కిలోల నవధాన్యాల విత్తనాలను చల్లుకోవాలని, 45 రోజుల అనంతరం పంటను భూమిలో కలియ దున్నడం ద్వారా అందులోని నత్రజని, కర్బన సమ్మేళనాలు భూమిని చేరి నేల సారవంతం అవుతుందన్నారు. అనంతరం రైతులకు నవధాన్యాల విత్తన ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం రీజనల్ కోఆర్డినేటర్ వెంకటరావు పాల్గొన్నారు.

## 5 నుంచి క్రికెట్ టోర్నీ

**గజపతినగరం:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 5 నుంచి క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం పిచ్‌ను సిద్ధం చేశారు. గజపతినగరానికి చెందిన కర్రి రమేష్, హర్షవర్ధన్, రెడ్డి జగదీష్ అనే ముగ్గురు యువకుల జ్ఞాపకార్థం ఈ టోర్నీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజేతలకు రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు, తృతీయ బహుమతి రూ.6 వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

# అంకితభావంతో పనిచేయండి

- ఎమ్మెల్యే అప్పలనరసయ్య



వసంతకు చెందిన విజయలక్ష్మికి నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

**గంట్యాడ:** అంగన్‌వాడీ సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. అంగన్‌వాడీ పోస్టులకు ఎంపికైన వారికి విజయనగరంలోని తన స్వగృహంలో మంగళవారం నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనత నివారణకు ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తోందని, ఈ పథకం కింద మంజూరు చేసిన పోషకాహార కిట్లును లబ్ధిదారులకు సక్రమంగా అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పీరుబండి హైమావతి, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, సీడీపీఓ డోకుల ఉమాభారతి తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి బోర్ల మరమ్మతులకు 'క్రాస్ ప్రోగ్రాం'



క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సత్యవంతుడు

**వేపాడ:** వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం క్రాస్ ప్రోగ్రాంను ప్రారంభించారు. మండల పరిధిలో పాడైన తాగునీటి బోర్లు మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం క్రాస్ ప్రోగ్రాం అమలు చేస్తోందన్నారు. గ్రామాల్లో తాగునీటి బోర్లు పాడైనట్లయితే వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, రుద్ర వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా...

### బ్యాంకింగ్ సేవలపై అవగాహన



మైక్రో ఏటీఎం సేవలను ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు

**గుర్ల:** బ్యాంకింగ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వల్లాపురంలో మైక్రో ఏటీఎం ద్వారా బ్యాంక్ పాస్‌బుక్ ప్రింటింగ్ సేవలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఖాతాదారులు లావాదేవీలకు సంబంధించి పాస్‌బుక్ పింటింగ్ సేవల కోసం బ్యాంకుకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఇకపై గ్రామాల్లోని బ్యాంకు మిత్ర వద్ద ప్రింటింగ్ చేసుకోవచ్చని అన్నారు. ఖాతాదారులంతా తప్పనిసరిగా బీమా పాలసీ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ నోడల్ అధికారి కిషోర్‌కుమార్, మేనేజర్ శిరీష, సునీల్ వర్మ, కనకరాజు, చిరంజీవి, బ్యాంక్ మిత్ర పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

### గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

**గంట్యాడ:** గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని హెచ్‌పీసీఎల్ సేల్స్ ఆఫీసర్ కంది శ్రీహర్ష అన్నారు. నరవ గ్రామంలో శ్రీనివాస్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వంటగ్యాస్ వినియోగంలో పాటించాల్సిన జాగ్రత్తలను మహిళలకు వివరించారు. గ్యాస్‌ను పొదుపుగా వాడుకోవాలని, వంట పూర్తయ్యాక రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలని సూచించారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్ ఉన్నవారికి సిలిండర్‌పై ప్రభుత్వం రూ.200 రాయితీ ఇస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పతివాడ భాస్కరావు, ఎంపీటీసీ మోపాడ అప్పలరాజు, పిల్ల వినోద్, గ్యాస్ ఏజెన్సీ ఎండీ శ్రీనివాస్‌రావు(బాబు) తదితరులు పాల్గొన్నారు.

### ఉన్నత చదువులు అభ్యసించాలి

**గజపతినగరం:** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని చేరుకునేందుకు ప్రణాళికతో కృషిచేయాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులతో మంగళవారం సమావేశమై పలు సూచనలు చేశారు. డిగ్రీ పూర్తి చేసుకుని బయటకు వెళ్తున్న విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించాలని, కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాశాలలో అధ్యాపకుల కొరత లేకుండా ప్రభుత్వం పూర్తిస్థాయిలో నియామకాలు చేపట్టిందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి బోధన పరంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఆశిస్తున్నామని, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామని అన్నారు.